అజ్ఞాత శత్రువు

అజీజ్

"సార్జంట్!"

"ఎస్ సార్!" స్ప్రింగ్ డోర్స్ తోసుకుంటూ డేవిడ్ లోనికి వచ్చేడు.

రిస్టు వాచీ చూసుకున్నాను. సాయంత్రం ఐదు గంటలు!

"ఆరు గంటలకి జనతా పబ్లిషింగ్ హౌస్‌లో, జీవన జ్యోతి వార పత్రిక సంపాదకుడు అమృతరావు సన్మాన సభ వుంది. వెళ్ళాలి. అమృతరావుతో నాకు చిరకాల పరిచయం వుంది. వెళ్ళకుంటే బావుండదు. ఏదైనా ఎమర్జెన్సీ మెసేజ్ వస్తే రిసీవ్ చేసుకో!" అన్నాను లేస్తూ.

సార్జెంట్ తలూపేడు.

టేబిల్ మీది క్యాప్ అందుకుని బైటికి నడిచేను.

మోటర్ బైక్ ఎక్కి బయలుదేరేను.

అమృతరావు పత్రికా సంపాదకుడే కాదు. మంచి రచయితకూడా! అతని సాహిత్య జీవనం పధ్నాలుగేళ్ళ ప్రాయంలోనే ప్రారంభమయిందిట.

అతని కలం ఎప్పుడూ పేదప్రజల సాధక బాధకాలని చాటి చెప్పడానికే తాపత్రయపడుతుంది. పత్రికా ప్రపంచంలోనే కాక అతనికి చిత్ర పరిశ్రమలోనూ ప్రవేశముంది.

అతను రాసిన నాలుగైదు కథలు సినిమాలుగా రూపొంది, ఘన విజయాలు సాధించేయి.

మిగతా రచయితలకు భిన్నంగా తనదంటూ ఒక శైలీ, బాణీ ఏర్పరచుకున్న అమృతరావు, తెలుగునాట పిన్నా పెద్దా అనే భేదం లేకుండా లక్షలాది అభిమానుల్ని సంపాదించేడు. దానికి తోడు శత్రువుల్నీ కూడ గట్టుకున్నాడు.

అతని రచనల్లో తమ నిజరూపాలు బట్టబయలైనట్టు తెలిసిన పెద్దమనుషులెందరో అతనికి అజ్ఞాత శత్రువులై కూర్చున్నారు.

ఏది ఏమైనా, అమృతరావు అమృత హృదయుడు. స్నేహశీలి. సౌమ్య స్వభావి. ఇంతాజేసి అతని వయసు నలభైలోపే! ఇంత పేరు సంపాదించీ, అపార ధనం ఆర్జించీ అతనింకా పెళ్ళి చేసుకోలేదంటే ఎవ్వరైనా ముక్కుమీద వేలు వేసుకోక మానరు!

అతను బ్రహ్మచారిగా ఉండిపోడాని క్కారణం. యవ్వనంలో అగ్రకులానికి చెందిన ఓ అమ్మాయిని

ప్రేమించేడనీ, ఆ అమ్మాయి తాలూకు పెద్దలు కుల గోత్రాల రూపంలో వారిమధ్య కందుగోడలుగా మారి ఆమెని మరొకరికిచ్చి పెళ్ళిచేసేరనీ, దాంతో అతనిమనసు విరిగి ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోయేడనీ, ఓ కథ ప్రచారంలో ఉంది.

మొత్తానికి, సాహిత్య కర్షకుడిగా అతనీ రంగంలో పాతికేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భాన అతని అభిమానులూ, పబ్లిషర్లూ కలిసి ఈరోజు ఘనంగా సన్మానం ఏర్పాటు చేసేరు.

అమృతరావు నవలలు ప్రచురించే జనతా పబ్లిషింగ్ హాల్లో సన్మాన సభ వుంది. కళ్యాణ చెట్టీ, ముత్తులింగం అనే పబ్లిషర్లు ఆ సంస్థ యజమానులు. అమృతరావుకి వాళ్ళిద్దరూ ప్రాణమిత్రులు కూడా....

ఇల్లు సమీపించేసరికి ఆలోచనలు చెదిరిపోయేయి.

గబగబ యూనిఫాం విడిచి బాత్ రూంలో దూరేను. స్నానం అదీ అయ్యేక, బీరువాలోంచి నల్ల పాంటూ తెల్ల షర్టూ తీసి తొడుక్కున్నాను. నవంబర్ నెలగనక చీకటి పడగానే చిరు చలి ప్రారంభమౌతోంది. వెచ్చగా వుంటుందని తోలు జర్కిన్ తీసి తొడుక్కున్నాను.

ఇంకా పదిహేను నిమిషాలే వుంది టైం!

గబగబ ఇంట్లోంచి బైటపడి, మోటర్ బైక్ ఎక్కి పాండీబజార్ వైపు పోనిచ్చేను. జనతా పబ్లిషింగ్ హౌస్ అక్కడే ఉంది.

2

పది నిమిషాల్లో జనతా పబ్లిషింగ్ హౌస్ చేరుకున్నాను.

ఆవరణలో అనేక వాహనాలు ఆగివున్నాయి. బైక్ ఆపి దిగుతుండగా, ఓ ఫియట్ కారు వచ్చి ఆగింది నా పక్కన.

అందులోంచి దిగుతున్న వ్యక్తిని చూచి—"హలో!" అన్నాను.

"హలో, ఇన్‌స్పెక్టర్! హౌ ఆర్ యూ?" అన్నాడతను చెయ్యి చాపి.

"క్వైట్, వెల్!"

ఆయన ఎవ్వరో కాదు. ప్రైవేట్ డిటెక్టివ్ ఉదయకుమార్! జటిలమైన అనేక హత్య కేసులు పరిష్కరించి బాగా పేరు సంపాదించేడు. అప్పుడప్పుడూ స్థానిక పోలీసులు కూడా ఆయన సహాయ సహకారాలు అర్థిస్తూంటారు.

"సభకు వచ్చారా?" అడిగేడు ఉదయకుమార్ నవ్వుతూ.

తలూపి, "పదండి. టైం అవుతోంది," అన్నాను హాలువైపు నడుస్తూ.

అప్పుడే మరో కార్లోంచి దిగుతున్న వ్యక్తిని చూసి కాస్త ఆశ్చర్యపోయేను. అతను మాజీ ఎం. ఎల్. ఏ. విష్ణుపాదం! అమృతరావుమీద అతనికున్న కక్ష జగద్విదితం!

ఎమ్. ఎల్. ఏ. పదవిలో అతను చేసిన అనేక అక్రమాలని తన పత్రికలద్వారా, రచనలద్వారా అమృతరావు చాటిచెప్పడంవల్లే ప్రజల కళ్లు తెరుచుకుని, గత ఎన్నికల్లో అతను ఘోర పరాజయాన్ని చవిచూడవలసి వచ్చింది.

అటువంటి బద్ధశత్రువైన అమృతరావు సన్మాన సభకు అతను రావడం విడ్డూరమే మరి!

ప్రవేశ ద్వారంలో, ఆత్మప్రకాశ్ నిల్చుని అతిథులకు స్వాగతం పలుకుతున్నాడు. అతను అమృతరావు తాలూకు పత్రికల సబ్ ఎడిటర్!

మమ్మల్ని చూసి—"సుస్వాగతం సార్! ఇంత క్రితమే రావుగారు మిమ్మల్ని అడిగేరు," అన్నాడు నవ్వుతూ.

హాలంతా అతిథులతో నిండివుంది అప్పటికే.

విశాలమైన ఆ హాలు నలువైపులా ఎత్తైన బుక్ షెల్ఫులుండేవి. ఈ రోజు అతిథులు కూర్చోడానికి ఇబ్బంది కలుగుతుందని కుడివైపు గోడకానించి ఉండే షెల్ఫును ఎడంవైపున్న గోడదగ్గరి షెల్ఫు కానించి ఉంచేరు. వాటి కెదురుగా ఎత్తైనబల్లలు పేర్చి, స్టేజి తయారుజేసేరు.

స్టేజి మధ్య మైక్. దాని వెనుక నాలుగైదు కుర్చీలు. మధ్యలో అమృతరావూ, అతని కిరుపక్కలా సినీపరిశ్రమకు చెందిన ముఖ్య అతిథీ, పత్రికా జర్నలిస్టులూ ఆసీనులై ఉన్నారు.

హాలంతా అర్ధచంద్రాకృతిలో కుర్చీలు పేర్చి ఉన్నాయి. నేను రావడం ఆలస్యమైంది. దాదాపు కుర్చీలన్నీ అతిథులతో నిండిపోయేయి. చాలామంది గోడ కానించి ఉన్న బుక్ షెల్ఫులదగ్గరే నిల్చుని చూస్తున్నారు స్టేజివైపు.

కూర్చున్నవారిలో అక్కడక్కడా ఒకటీ అరా కుర్చీ ఖాళీ ఉన్నా, ఈ జన సమూహాన్ని దాటుకుంటూ అక్కడివరకూ చేరుకోవడం చాలా కష్టం.

"రండి, ఆ చివర ఖాళీ కుర్చీలని ఆక్రమిద్దాం" అన్నాడు డిటెక్టివ్ ఉదయకుమార్.

"మీరు వెళ్ళి కూర్చోండి. నేనిక్కడే నిల్చుని చూస్తాను. స్టేజి క్లియర్‌గా కనిపిస్తోంది" అన్నాను.

ఆయన జన సమూహాన్ని చీల్చుకుంటూ అటు వెళ్ళేడు.

అతిధులింకా వస్తూనే ఉన్నారు లోనికి. కొద్ది సేపట్లోనే హాలంతా ఇసుక వేస్తే రాలని జనంతో నిండిపోయింది.

ఆరుంబావుకి సభ ప్రారంభమౌతుంది.

ముందు పబ్లిషర్ ముత్తులింగం స్టేజిమీదికి వచ్చి అమృతరావు గుణగణాలనీ, అతనితో తమకున్న వ్యక్తిగత పరిచయాన్ని ఉటంకిస్తూ ప్రసంగించి, నిలువెత్తు పూల హారంతో, అతని కంఠాన్ని అలంకరించేడు.

తరవాత సభాధ్యక్షుడైన సినీ ప్రముఖుడు లేచి, అమృతరావు రచనా వైవిధ్యాన్నీ, ఆ రచనలద్వారా ఆయన సమాజాని కందించే సందేశాలనీ ఉదహరిస్తూ కాసేపు ప్రసంగించి, పట్టు శాలువతో రచయితను సత్కరించేడు.

ఆహుతుల కరతాళ ధ్వనులతో హాలు మారు మోగింది.

ముత్తులింగం తప్ప, జనతా పబ్లిషింగ్ హౌస్ రెండవ యజమాని కళ్యాణచెట్టి స్టేజిదగ్గర కనిపించకపోవడం నా కాశ్చర్యాన్ని కలిగించింది.

చప్పట్లు సన్నగిల్లేక అమృతరావు హుందాగా మైక్ దగ్గరికి వచ్చి కంఠం సవరించుకున్నాడు.

"గౌరవనీయులైన సభాధ్యక్షులకూ, మిత్రులకూ, శ్రేయోభిలాషులకూ, అభిమానులకూ నా వందనాలు!

ఈ రోజు నా జీవితంలో అత్యంత ఆనందదాయక మైన రోజని చెప్పవచ్చు. నా జీవితంలో మరవలేని సంఘటనలెన్నో జరిగినా, ఈ రోజుకు ఓ ప్రాధాన్యత ఉంది. అదే, నా సాహిత్యజీవనం పాతికేళ్ళు పూర్తి చేసుకోవడం.

ప్రతి మనిషీ, బాల్యంలోనే తన భవిష్యత్తుకంటూ కొన్ని లక్ష్యాలని ఏర్పరచుకుంటాడు. కొందరికి అదృష్టమూ, అవకాశమూ తోడై ఆ లక్ష్యాలను దిగ్విజయం గావిస్తే, మరికొందరికి..." అమృతరావు వాక్యం ఇంకా పూర్తికాలేదు.

"ఢాం!" మనే శబ్దంతో హాలు గింగురుమంది.

అంతవరకూ మైక్ ముందు నిల్చుని ప్రసంగిస్తున్న అమృతరావు చెయ్యి ఛాతీవైపు వెళ్ళింది. అతను వేసుకున్న లాల్చీమీద, గుండెదగ్గిర ఉబుకుతున్న రక్తాన్ని చూడగానే దిగ్భ్రాంతితో నా నోరు తెరుచుకుంది!

అమృతరావు చూస్తూ, చూస్తూనే అమాంతంగా స్టేజి మీద పడిపోయేడు, బోర్లా! క్షణంపాటు హాల్లో ఉన్న ప్రేక్షకులకి ఏం జరిగిందో, ఏం జరుగుతుందో ఓ పట్టాన అర్థంకాలేదు.

అమృతరావు దబ్బున క్రిందపడ్డాక గానీ జరిగిందేమిటో బోధపడలేదు అందరికీ.

3

హత్య! నిండు సభలో, దాదాపు రెండువందలమంది చూస్తుండగా ఒక ప్రముఖ వ్యక్తి హత్య!

హాల్లో భయోత్పాతం, కోలాహలం చెలరేగింది. ఒక

ర్నొకరు తోసుకుంటూ స్టేజి దగ్గరికి పరిగెత్తసాగేరు.

మెరుపులా ప్రవేశద్వారాన్ని సమీపించి, తలుపులు మూసేశాను. ఈ సమయంలో ఎవ్వరినీ బైటికెళ్ళనివ్వకూడదు. అప్పుడే, డిటెక్టివ్ ఉదయకుమార్ జనంలోంచి నా దగ్గరికి పరిగెత్తుకొచ్చేడు.

"గుడ్ ఇన్‌స్పెక్టర్! లోపలున్నవారిలోనే హంతకుడున్నాడు. ఎవ్వర్నీ బైటికెళ్ళనివ్వకూడదు," అన్నాడు రొప్పుతూ.

"మీరిక్కడ నిల్చోండి. నేను అమృతరావు పరిస్థితి చూస్తాను," అంటూ స్టేజివైపు పరిగెత్తేను.

స్టేజిమధ్య అమృతరావు నిశ్చలంగా పడున్నాడు. కళ్లూ, నోరూ సగం తెరిచి ఉన్నాయి. కుడిచెయ్యి ఛాతీ కింద మడిచి ఉంది.

అతను మరణించేడు!

అప్పుడు గమనించేను,అంతవరకూ కనిపించని కళ్యాణ చెట్టి మిగతా జనంతోబాటు శవందగ్గిర ఉండటం!

అతిధులు ఎవ్వరికి తోచినట్టు వారు మాట్లాడుకుంటున్నారు.

"శబ్దం వెనకవరసలోంచి వచ్చింది!"

"మీరు చూసేరా, హంతకుణ్ణి?"

"లేదు! శబ్దం ఏవైపునించి వచ్చిందో మాత్రం తెలుసు!"

"ఏవైపునించి వచ్చింది?"

"గోడవారగా నిల్చొబెట్టారే, ఆ బుక్ షెల్ఫ్‌ల దగ్గర్నించి!"

వారి మాటలు వింటూ, తలెత్తి బుక్ షెల్ఫ్‌లవైపు చూసేను. వెనక వరసలో గోడవారగా అనించివున్నాయి అవి. రెండూ పుస్తకాలతో నిండి ఉన్నాయి.

"ఈ భవనానికి వెనకవైపున ఏదైనా ద్వారం ఉందా?" అడిగేను.

"ఉందండీ! ఆ పక్కగదిలోంచి లోనికెళ్తే కనిపిస్తుంది."

చటుక్కున లేచినిగి అటు నడిచేను. సింహద్వారం తగ్గిర డిటెక్టివ్ కాపలా ఉన్నాడు. హంతకుడికి వెనక ద్వారం విషయం తెలిసివుంటే తప్పక ఆ దార్న జారుకో డానికి ప్రయత్నిస్తాడు.

గబగబ ఆ గదిలో అడుగుపెట్టేను. ఆ గదిలోంచి మరో గదిలోకెళ్ళడానికి తలుపుంది. 'బుక్ బైండింగ్ రూం' అనే బోర్డు వేళాడుతోంది.

తలుపుగుండా గదిలో అడుగుపెట్టి నివ్వెరబోయేను. నా అంచనా తప్పలేదు. చిరు చీకట్లో ఓ ఆకారం ఆ గది లోంచి బైటకెళ్ళే తలుపువైపు వెళుతోంది. నా అడుగుల శబ్దం విని గిరుక్కున వెనుదిరిగింది.

మెరుపులా గోడ తడిమి లైటు వెలిగించేను.

మగాడు కాదు! ఆడది!!

ముప్పై, ముప్పై అయిదేళ్ళుంటాయామెకి. పచ్చని మేలి బంగారాన్ని జ్ఞప్తికి తెచ్చే నిండైన ఒళ్ళు, యవ్వన దశ దాటినా, మొహంలో విపరీతమైన ఆకర్షణ. చెంపలకి లేత గులాబీ రంగు. పెదాలకి లిప్‌స్టిక్. అందంగా వేసుకున్న జుత్తుముడి. నుదుట ఎర్రని తిలకం. చేతిలో హాండ్ బాగ్.

నన్ను చూడగానే ఆమెలో ఎటువంటి ఖంగారూ

కనిపించకపోగా, కళ్ళల్లో నీటి పొర చూసి నివ్వెర బోయేను. ఉబికి వస్తున్న దుఃఖాన్ని మునిపంటితో తొక్కిపెడుతున్నట్టు ఆమె ముక్కు పుటాలు అదురుతున్నాయి.

"ఎవ్వరు మీరు? ఈ దారిన ఎక్కడికెళ్తున్నారు?" అడిగేను.

అతి కష్టంమీద ఆమె పెదాలు విచ్చుకున్నాయి. "నేనిక్కడ ఒక్క క్షణం వుండలేను. సింహద్వారం మూసివుంది. అందుకే ఈ దారిన పోతున్నాను" అంది.

"ఇది హత్యా ప్రదేశం! లోపలున్న వాళ్ళల్లోనే ఎవ్వరో ఆ హత్య చేశారని మా నమ్మకం! అనుమతి లేకుండా ఇలా దొంగచాటుగా వెళ్లిపోడానికి ప్రయత్నించడం అనుమానానికి దారితీస్తుంది మరి!"

ఆమె నిట్టూర్చింది. "నిజమే! నా పరిస్థితి మిగతా వారికి భిన్నంగా వుంది. తన కళ్ళు గప్పి నేనీ సభకి వచ్చేనని నా భర్తకి తెలిస్తే మా మధ్య నానా గొడవలూ తలెత్తుతాయి.

అమృతరావుగారితో నాకు వ్యక్తిగత పరిచయం వుంది. ఆయన లక్షలాది అభిమానుల్లో నేనూ ఒకర్తిని. నా భర్తకి అది ఇష్టంలేదు. నేనతన్ని కలుసుకోవద్దని అనేక ఆంక్షలు పెట్టేరు.

ఐనా, నేను అమృతరావు స్నేహాన్ని వదులుకోలేక అడపాదడపా అతన్ని కలుసుకుంటున్నాను. అంతటి నా అభిమానుణ్ని ఈరోజు సన్మానిస్తున్నారని తెలిసి, ఆ వేడుకను కళ్ళారా చూడాలని వచ్చేను.

ఇంతలో ఈ ఘోరం జరిగిపోయింది. ఈ సభలో నేనూ పాల్గొన్నట్టు నా భర్తకి తెలియడం నాకిష్టంలేదు. అందుకే ఇలా వెళ్ళిపోతున్నాను."

"మీ భర్త ఎవ్వరు?"

"అపోలో థియేటర్ యజమాని, వేణుగోపాల రావు!"

"మీ పేరు తెలుసుకోవచ్చా?"

"మందహాసిని!"

ఆమెని చూస్తోంటే, హత్య చెయ్యగలిగే వ్యక్తిలా కనిపించడంలేదు. పైగా, స్టేజి సమీపంలో వున్న మొదటి వరసలోనే ఆమె కూర్చున్నట్టు జ్ఞాపకం! పిస్తోలు శబ్దం వెనక వరసనించి వచ్చింది. తన ఇబ్బందుల్ని ఇంత స్పష్టంగా చెప్పేస్తున్న ఆమెను ఆపడం బావుండదు.

దేనికైనా మంచిదని—"మీ హాండ్ బాగ్ ఓమారు చెక్ చెయ్యాలనుకుంటున్నాను. ఆ తరవాత మీరు వెళ్ళిపోవచ్చు" అన్నాను చెయ్యి చాపుతూ.

ఆమె సంకోచించకుండా బ్యాగ్ అందించింది.

తెరిచి చూసేను. హాండ్ కర్చీఫ్, చిన్న మనీపర్స్, బాల్ పెన్, లిప్ స్టిక్, పాకెట్ మిర్రర్ తప్ప మరేం లేవు.

బ్యాగ్ తిరిగి ఆమెకిస్తూ—"మీ చిరునామా ఇచ్చి వెళ్ళండి." అన్నాను.

ఆమె బ్యాగ్ లోంచి కాగితం, కలం తీసి, ఎడ్రస్ రాసి అందించింది.

"ఆల్ రైట్! మీరిక వెళ్ళవచ్చు."

'థాంక్స్' చెబుతూ తలుపు తెరుచుకుని వెళ్ళి పోయింది.

గడియవేసి హాల్లోకి నడిచేను.

4

డిటెక్టివ్ ఉదయకుమార్ ఇంకా తలుపు దగ్గరే నిల్చుని, ఎక్స్‌రే కళ్ళతో అందర్నీ పరిశీలిస్తున్నాడు.

వెంటనే స్థానిక పోలీసులకి ఫోన్ చేసి పిలిపించాలి. వారిది క్రయిం బ్రాంచ్ విభాగం. ఏ రేంజ్‌లో ఏ నేరం జరిగినా, ఆ రేంజి తాలూకు లోకల్ పోలీసులే మొదట్ల కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభిస్తారు. ఆ కేసు వాళ్ళకి దుస్సాధ్యమైనప్పుడే మాకప్పగించడం జరుగుతుంది.

హత్య నా సమక్షంలో జరిగింది గనక, స్థానిక పోలీసులకు నేను వ్యక్తిగతంగా సహాయపడటం ధర్మం!

డిటెక్టివ్ ఉదయకుమార్ని సమీపించి—"మీరు వెళ్ళి లోకల్ స్టేషన్‌కి ఫోన్ చెయ్యండి. నేనిక్కడే నిల్చుంటాను" అన్నాను.

"ఫోన్ ఎప్పుడో చేశారు. వాళ్ళిపాటికి వస్తూంటారు" అన్నాడాయన.

సిగరెట్ అంటించాలని జేబులోంచి సిగరెట్ కేస్ తీసేను. దాన్ని తెరుస్తుండగా చేతిలోంచి జారి, వెనక వరసలో వున్న కుర్చీలకింద పడింది. రెండు మూడు సిగరెట్లు దొర్లుకుంటూ కిందికెళ్ళాయి.

వంగి వాటిని ఏరుకోబోయిన నా దృష్టి హఠాత్తుగా నాలుగో కుర్చీకింద కనిపిస్తున్న వస్తువు మీద పడగానే ఉలిక్కిపడ్డాను. అది పిస్తోలు!

లైటు కాంతిలో నిగనిగ మెరుస్తున్న పిస్తోలు!!

"ఉదయకుమార్ గారూ! ఇలా రండి!" అన్నాను వెంటనే.

ఆయనతోబాటు మిగతా జనంకూడా అక్కడ పోగయ్యేరు. కుర్చీలు పక్కకి జరిపేను. కింద పడున్న పిస్తోలు చూడగానే అందరూ ఒకరి మొహాలొకరు చూసుకోసాగేరు.

హాండ్ కర్చీఫ్ దానిమీద వేసి, జాగ్రత్తగా అందు కున్నాను. అది .32 కాలిబర్ పిస్తోలు! విరిచి చూసేను. ఆరు గుళ్ళు ఉండవలసిన ఛేంబర్ లో ఐదే వున్నాయి!

అదే క్షణంలో ఓ నడివయసావిడ గుంపులోంచి గబ గబ నన్ను సమీపించింది. "హంతకుడెవరో నాకు తెలుసండి! అదుగో, అతనే! అతను పిస్తోలుతో కాలుస్తుం డగా నా కళ్ళారా చూసేను" అంది వేలితో చూపిస్తూ.

నాతోబాటు అందరూ ఆ వ్యక్తివైపు చూసి నివ్వర బోయేరు. అతను ఎవ్వరో కాదు.

అమృతరావు సబ్ ఎడిటర్ ఆత్మప్రకాశ్!

"చూస్తారేం? పట్టుకోండి. పారిపోతాడు" అంటోం దామె.

అంత పెద్ద నేరం నెత్తినపడుతున్నా, ఆత్మప్రకాశ్ లో ఎటువంటి మార్పు లేకపోగా, నింపాదిగా అడుగులు వేస్తూ నన్ను సమీపించేడు.

"రాజారెడ్డిగారూ! గురుతుల్యులైన అమృతరావు గార్ని హత్యచేసే అవసరం నాకేమిటి? నేను నిరు ద్యోగిగా అష్టకష్టాలు పడుతున్న రోజుల్లో తన దగ్గర

ఉద్యోగం ఇచ్చి, నా జీవనోపాధికి మార్గదర్శకుడైన ఆ మహనీయుణ్ని చంపేంతట విశ్వాస ఘాతకుణ్ణి, కిరాతకుణ్ణీ కాను నేను.

బహుశా, ఈవిడికి వేరే విషయంలో అపార్థం జరిగి వుంటుంది'' అంటూ జేబులోంచి, సిగరెట్ కేస్ ప్రమాణంలో వున్న నల్లని కెమెరా తీశాడు ఆత్మప్రకాశ్.

"నేను వెనకవరసలో నిల్చుని, ఈ కెమెరాతో అమృతరావుగారి ఫోటోలు తీస్తున్నాను, మా పత్రికల్లో ప్రచురించడానికి. ఫోటోలు తియ్యమని ఆయనే నన్ను ఆదేశించారు. నా చేతిలో ఈ కేమెరా చూసి, ఈవిడ పిస్తోలు అని భ్రమపడుంటారు!''

అందరూ నిట్టూర్చారు ఒక్కసారి! అంతవరకూ హంతకుడు పట్టుపడ్డాడు కదా అని ఆనందించిన జన సమూహం అతనిచ్చిన సంజాయిషీతో నిరుత్సాహపడింది.

ఆ సంజాయిషీ సమంజసంగానే తోస్తోంది. పైగా అతనికి అమృతరావుని చంపే అవసరం ఏమీ కనిపించడం లేదు.

సాలోచనగా తలూపుతూ, చేతిలోవున్న పిస్తోలు అటూ ఇటూ తిప్పి చూడసాగేను. నా దృష్టి పిడిమీద నిలిచిపోయింది!

కొత్తగా ఏదైనా స్టీలుగిన్నె కొన్నప్పుడు షాపువాళ్ళు, దానిమీద ఖాతాదారు పేరు చెక్కియిస్తారు, ఉచితంగా. అలా చెక్కివుంది పేరు పిస్తోలు పిడిమీద!

"విష్ణుపాదం!"

ఆ పేరు చూడగానే సడన్ గా జ్ఞాపకం వచ్చింది, నేను లోనికి వస్తుండగా మాజీ ఎమ్.ఎల్.ఏ. విష్ణుపాదం కూడా కారు దిగుతుండటం!

ఉదయకుమార్ కు చూపేను ఆ పేరు.

"కేసు తేలిపోయింది ఇన్ స్పెక్టర్! విష్ణుపాదం ఇక్కడికి రావడమే ఏదో అవాంతరానికి మూలసంకేతం!" అన్నాడాయన మెరిసే కళ్ళతో.

ఇద్దరం చుట్టూ కలయజూశాం. విష్ణుపాదం కనిపించేడు.

"ఒకసారిలా రండి!" అన్నాను అతన్ని సంబోధించి.

అతని కనులు ముడివడ్డాయి. జనాన్ని తప్పుకుంటూ వచ్చేడు మా దగ్గరికి.

కర్చీఫ్ లోవున్న పిస్తోలు పిడి చూపేను.

పక్కలో పిడుగుపడ్డట్లు అదిరిపడ్డాడు.

"ఇది మీ పిస్తోలేనా?" అడిగేను.

"ఔను! నాదే!"

"అమృతరావు దీనితోనే చంపబడ్డాడని రూఢి అయింది. అతని గుండెలో దిగిన గుండునూ, ఈ పిస్తోలునూ నిపుణులచేత పరీక్షజేపిస్తే ఆ విషయం స్పష్టమౌతుంది. ఇది మీ దేనని మీరే ఒప్పుకుంటున్నారు గనుక, అమృతరావుని చంపింది కూడా మీరే!" అన్నాను గంభీరంగా.

హాల్లో సూది పడితే వినిపించే నిశ్శబ్దం!

"ఇన్ స్పెక్టర్ గారూ! నా మాట నమ్మండి. నాకేం తెలీదు. నేనిక్కడికి పిస్తోలు తీసుకురాలేదు. ఇంట్లో వుండవలసిన పిస్తోలు ఇక్కడికెలా వచ్చిందో ఊహించలేకుండా వున్నాను" అన్నాడు విష్ణుపాదం చమట్లు కక్కుతూ.

చిన్నగా నవ్వేను. "విష్ణుపాదంగారూ! అమృతరావు మీద మీకున్న కక్ష జగద్విదితం. శాసన సభ్యుడిగా మీరు చేసిన నిర్వాకాలు తన పత్రికద్వారా, రచనల

ద్వారా ఆయన నిర్భయంగా చాటడంవల్లే, ప్రజలకు మీ నిజరూపం వెల్లడై, గత ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కలేదు మీకు.

ఇంత వైరం వున్న ఆయన సన్మానసభలో మీరు వెంచేయడమేమిటి? అక్షరాలా మీ ఆయుధమైన ఈ పిస్తోలు ఇక్కడ పడుండటమేమిటి? మీ మాటలు ఎవ్వరు నమ్మేది?''

విష్ణుపాదం నిట్టూర్చాడు. ''మీరు చెప్పింది నిజమే! అమృతరావుమీద నేను పగబట్టిన సంగతీ వాస్తవమే! కాని, అది ఒకనాటి విషయం! ఏనాడైతే నేను ఎన్నికల్లో ప్రజలచేత తిరస్కరించబడ్డానో, ఆ తరువాత నాలో మార్పు వచ్చింది.

ఆ రోజుల్లో నేను చేసిన పనులకు ఎంతో పశ్చాత్తాపం చెందేను. నాకు కనువిప్పు కలిగించిన అమృతరావుపట్ల రాగద్వేషాలు మాని గౌరవాభిమానాలు పెంచుకున్నాను మేమిద్దరం స్నేహితులమయ్యాం!

ఈ రోజు నా స్నేహితుడి సన్మానసభకు వచ్చానే గానీ అతన్నేదో చెయ్యాలని రాలేదు. హత్య చెయ్యాలనుకుంటే, ఈ నిండుసభ తప్ప మరో చోటు దొరకలేదా నాకు? హత్య నేనే చేసివుంటే పేరు చెక్కివున్న నా పిస్తోలు ఇలా దేనికి పారేస్తాను? ఆలోచించండి ఇన్‌స్పెక్టర్!''

నా బుర్ర చురుగ్గా పనిచేస్తోంది. అతను చెప్పిందాంట్లో నిజం లేకపోలేదు. హత్య అతనే చేసివుంటే పిస్తోలు అలా దేనికి పారేస్తాడు? అదీ స్పష్టంగా పేరు చెక్కివున్న పిస్తోలు!

"ఐతే, ఎవ్వరో మీ ఇంట్లోంచి దీన్ని దొంగిలించి, హత్యచేసి ఇక్కడ పారేశారంటారా?" అడిగేను.

"ముమ్మాటికీ అంతే!" అన్నాడు విష్ణుపాదం ఖచ్చితంగా.

"మీ ఇంట్లో మీ పిస్తోలు ఎక్కడ వుంటుందో, అది దొంగిలించడానికి అవకాశమున్న వ్యక్తులు...ఐ మీన్ మీ ఇంటికి వచ్చేపోయే స్నేహితులు ఇంత మందిలో ఎవరెవరో చెప్పగలరా?" అడిగేను.

విష్ణుపాదం ఓ మారు అందర్నీ కలయజూసి "వీరిలో కళ్యాణచెట్టీ, ముత్తులింగం, ఆత్మప్రకాశ్ లు తప్ప తరచూ మా ఇంటికి వచ్చే స్నేహితులెవ్వరూ లేరు. వీళ్ళలోనే నా పిస్తోలు దొంగిలించిన వారున్నారని నా ఉద్దేశంకాదు. మీ ప్రశ్నకి నా సమాధానం ఇది!" అన్నాడు కర్ర విరక్కుండా పాముని చంపినట్టు.

వెంటనే అందుకున్నాడు ఆత్మప్రకాశ్. "కళ్యాణ చెట్టీ, ముత్తులింగంగార్ల సంగతెలావున్నా, నేను మాత్రం అమృతరావుగారివెంట తప్ప, విడిగా ఎన్నడూ వీరి ఇంటికెళ్ళలేదు. ఏమంటారు విష్ణుపాదంగారూ?"

విష్ణుపాదం తిలూ పేడు.

కర్చీఫ్ లో పిస్తోలు చుట్టి నా జర్కిన్ జేబులో వేసుకుంటూ ఆత్మప్రకాశ్ తో ఏదో అనబోయేను.

అదే సమయంలో స్థానికపోలీస్ సబిన్ స్పెక్టర్ తన బలగంతో వచ్చేశాడక్కడికి. నన్ను చూడగానే సెల్యూట్ కొట్టేడు. అతన్ని పక్కకి తీసికెళ్ళి జరిగిందంతా పూసగుచ్చినట్టు వివరించి, ఏం జెయ్యాలో సూచనలిచ్చేను.

పోలీస్ ఫోటోగ్రాఫర్స్, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్స్ చకచక పని ప్రారంభించేరు. శవం రిగర్‌మార్టిస్ రికార్డ్ చేసుకున్నాడు డాక్టర్. అంతా అయ్యాక శవాన్ని అంబులెన్స్‌లో పోస్ట్‌మార్టంకు తరలించేరు.

తలుపు దగ్గర ఇద్దరు కానిస్టేబుళ్ళని నియమించాం.

“జంటిల్‌మన్! ఇక్కడ ప్రాథమిక విచారణ పూర్తయ్యేవరకూ ఎవ్వరూ బైటికెళ్ళకూడదు. ఈవిధంగా మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు మన్నించాలి!” అన్నాను.

5

“మిస్టర్ విష్ణుపాదం! మీరూ, కళ్యాణచెట్టిగారూ, ముత్తులింగంగారూ, ఆత్మప్రకాశ్ దయచేసి నాతో ఆఫీస్‌గదిలోకి రండి” అన్నాను హాలుపక్కనున్న ఆఫీస్ వైపు నడుస్తూ.

ఆ నలుగురితో బాటు స్థానిక సబిన్స్పెక్టర్, డిటెక్టివ్ ఉదయకుమార్లు కూడా నా వెంట ఆఫీస్‌లో ప్రవేశించేరు.

భవనం తలుపులన్నీ మూసేయడంవల్లా, నాలో కలుగుతున్న ఎక్సైట్‌మెంట్‌వల్లా, తొడుక్కున్న జర్కిన్‌తోనూ ఉక్కబోస్తున్నట్టు తోస్తోంది. చల్లగా ఉంటుందని, జర్కిన్ విప్పి తెరిచి ఉన్న ఆఫీసు గది తలుపు రెక్కకి వేళాడదీసేను.

“ప్లీజ్, టేక్ యువర్ సీట్స్!” అంటూ ఓ కుర్చీలో చతికిలబడ్డాను.

అంతా కూర్చున్నారు.

కళ్యాణచెట్టివైపు తిరిగి “చెట్టిగారూ! స్టేజిమీద అమృతరావును సన్మానిస్తున్న సందర్భంలో మీరక్కడ

కనిపించలేదు. నిజానికి మీరక్కడ ఉండవలసింది! ఏమంటారు?" అడిగేను.

చెట్టి తడుముకోకుండా జవాబిచ్చేడు. "సన్మానం తర వాత ఆహూతులకు తేనీటివిందుకూడా ఏర్పాటుచేశాం. ఆ అరేంజ్‌మెంట్స్ చూసుకోడంలో బిజీగా ఉన్నందుకల్ల నేనక్కడ కనిపించలేదు. పిస్తోలు పేలిన శబ్దం విని పరి గెత్తుకొచ్చేను."

"ఆల్‌రైట్, ముత్తులింగంగారూ! మీరు స్టేజిమీద అమృతరావు పక్కనే ఉన్నారు కదా, అక్కణ్ణించి హాల్లో ఉన్న ప్రతి వ్యక్తి కనిపిస్తాడు కదా, పిస్తోలు ఎవ్వరు పేల్చారో చూచాయగానైనా చూడలేదా మీరు?"

"అంత హఠాత్తుగా అటువంటి సంఘటన జరుగుతుం దని ఎవ్వరు కలగన్నారు? పిస్తోలు శబ్దం వెనకవరస లోంచే వచ్చినట్టు లీలగా తోచింది నాకు" అన్నాడు ముత్తులింగం.

అతని జవాబుతో మెరుపులా ఓ ఆలోచన తట్టింది నాకు. ప్రతి వ్యక్తీ పిస్తోలు శబ్దం వెనక వరసనించి వచ్చిందని చెబుతున్నాడు. వెనకవరస దగ్గరే ఉన్నాయి రెండు బుక్‌షెల్ఫులు. ఆ రెంటిమధ్యా కొద్ది ఖాళీస్థలం ఉంది.

హంతకుడు ఆ సందులోనే నక్కి, పుస్తకాలమధ్య నించి షూట్ చేసేడా? అందుకే అతన్ని ఎవ్వరూ చూడ లేకపోయేరా? హత్య జరిగేక హాల్లో కోలాహలం ప్రారంభమయ్యేక, హంతకుడు బుక్‌షెల్ఫుల మధ్యనించి బైటపడి ఏమీ ఎరగనట్టు తిరిగి జనంలో కలిసిపోయి ఉంటాడు...

నా ఆలోచనా స్రవంతిని తుంచివేస్తూ ఆత్మప్రకాశ్ కంఠం వినిపించింది. "ఇన్‌స్పెక్టర్ గారూ! మీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలి!"

తలెత్తేను.

అతని కళ్ళల్లో చిన్న మెరుపు!

"రండి బైటికి!" అంటూ లేచి, అతన్ని వెంటబెట్టుకుని బైటికి నడిచేను.

సబిన్‌స్పెక్టర్ కూడా వెనకే వచ్చేడు అతనేం చెబుతాడో విందామని.

"చెప్పండి, ఏమిటి?" అడిగేను కుతూహలంగా.

ఆత్మప్రకాశ్ నా దగ్గిరికి జరిగి "ఈ హత్యకీ, నేను చెప్పబోయే విషయానికీ ఎంతవరకూ సంబంధముందో మీరే నిర్ణయించాలి. వారంరోజుల క్రితం వెనకా ముందూ ఆలోచించకుండా అమృతరావుగారు ఓ వీలునామా రాసేరు," అన్నాడు.

"వీలునామా రాశారా? నాకు తెలిసి ఆయనకు వారసులంటూ ఎవ్వరూ లేరే? ఎవ్వరి పేర్న రాసేరు?"

"కల్యాణచెట్టీ, ముత్తులింగం పేర్న!"

ఆశ్చర్యంతో నోరు తెరిచేను. "ఈ సంగతి మీకెలా తెలుసు."

"రాసేటప్పుడు నేను వాళ్ళదగ్గిరే ఉన్నాను!"

"సమయానికి చాలా ముఖ్యమైన విషయం చెప్పేరు. ఆల్‌రైట్ మీరు వెళ్ళి, డిటెక్టివ్ ఉదయకుమార్ గార్ని పంపించండి," అన్నాను ఆత్మప్రకాశ్‌తో.

అతను లోనికెళ్ళి డిటెక్టివ్‌ని పంపేడు బైటికి.

ఆయనకు ఆత్మప్రకాశ్ చెప్పిన విషయాలు వివరించి "మీ అభిప్రాయం ఏమిటి?" అడిగేను.

"ఆత్మప్రకాశ్ చెప్పినట్టు అమృతరావు, కళ్యాణచెట్టి, ముత్తులింగం పేర విల్లు రాసింది నిజమే అయితే, అమృత రావుని హత్యచెయ్యడానికి వాళ్ళకే ఎక్కువ కారణం కనిపిస్తోంది.

అమృతరావు ఇటు తన పత్రికలద్వారా, రచనల ద్వారా, సినీఫీల్డుద్వారా చాలా డబ్బు గడించేవుంటాడు. పెళ్ళీ పెటాకులూ లేని బైరాగి, వారసులంటూ ఎవ్వరూ లేరు. తన మరణానంతరం యావదాస్తీ తన ఆప్తమిత్రులైన కళ్యాణచెట్టీ, ముత్తులింగాలకు చెందేట్టు విల్లు రాసినా రాసి ఉండవచ్చు.

వాళ్ళిద్దరికీ విష్ణుపాదంతో పరిచయం ఉంది. తరుచూ వాళ్ళు తనింటికి వస్తూ పోతుంటారని అతనే ఒప్పుకున్నాడు. వాళ్ళే అతని పిస్తోలు దొంగిలించి, అమృత రావుని చంపి, అనుమానం అతనిమీదకు మళ్ళేలా పిస్తోలు కుర్చీలకింద పడేసి ఉంటారు. టూకీగా ఇదీ నా ఊహా గానం!" అన్నాడు ఉదయకుమార్.

"ఆ విషయాలన్నీ నేను వాళ్ళతో మాట్లాడి కనుక్కుంటాను. ఈలోగా మీరు చిన్నపని జేసిపెట్టాలి. హంతకుడు హాల్లో గోడవారగా నిలబెట్టివున్న బుక్ షెల్ఫుల మధ్య నిల్చుని పిస్తోలుతో కాల్చి ఉంటాడని నా అనుమానం. మీరొకసారి అక్కడికెళ్ళి నా అనుమానానికి ఆస్కారం ఎంతవరకు ఉందో పరిశీలించండి."

డిటెక్టివ్ తలూపి "ఔను! అందుకే పిస్తోలు పేలుస్తుండగా ఎవ్వరూ ఎవ్వర్నీ చూడలేకపోయేరు. మీరు మీ పని కానివ్వండి. నే వెళ్ళి చూసొస్తాను" అంటూ హాలువైపు నడిచేడు.

సబిన్‌స్పెక్టర్‌తో తిరిగి గదిలో ప్రవేశించేను.

"కళ్యాణచెట్టిగారూ! ఈమధ్య అమృతరావు మీ పేర వీలునామా రాసేడని విన్నాను, నిజమేనా?" అడిగేను.

ఆ ప్రశ్నతో ముత్తులింగం, కళ్యాణచెట్టీ ఉలిక్కిపడ్డారు. తరవాత ఏదో అర్థమైనట్టు ఆత్మప్రకాశ్ వైపు చూసేరు.

కళ్యాణచెట్టి తేరుకుని నావైపు తిరిగేడు. "నిజమే! అదంతా వేళాకోళంలో జరిగిపోయింది. ఈరోజు దానికింత ప్రాముఖ్యం వస్తుందని ఆనాడు మేమెవ్వరంఅనుకోలేదు. నిజానికది చట్టబద్ధమైన వీలునామా కాదు!

ఆరోజు అమృతరావూ, ఆత్మప్రకాశ్ ఇక్కడికి వచ్చి మాతో మాట్లాడుతూ కూర్చున్నారు. మాటల మధ్య ముత్తులింగం నవ్వుతూ, 'అమృతరావ్! నువ్వు రాత్రింబవళ్లూ కష్టపడి ఇంత సంపాదిస్తున్నావు కదా? ఎవ్వరికోసం. నీ తదనంతరం ఆ డబ్బంతాఎవ్వరు అనుభవించేది?' అన్నాడు.

అందుకు అమృతరావు నవ్వి—"ఈ రోజు నేనీ స్థితిలో ఉన్నానంటే దానికి మూలకారకులు మీరే! నా తొలి నవల ప్రచురించి, పాఠక ప్రపంచానికి పరిచయం చేసింది మీరే. ఆనాడు పేరులేని కొత్త రచయితనైన నా స్క్రిప్టును మీరు ధైర్యంతో స్వీకరించి వుండకపోతే, బహుశా నేను మళ్ళీ ఎన్నడూ కలం ముట్టుకునేవాణ్ని కానేమో! ఆ నవల ప్రచురింపబడ్డందుకే నాలో సాహిత్య పిపాస శాశ్వతంగా వేళ్లు పాతుకుంది.

ఇంతటి ఆత్మీయులైన మీరిద్దరూ వుండగా, నాకు

వారసులు లేరంటూ రేమిటి? నా తదనంతరం నా డబ్బంతా మీరే అనుభవించాలి!'' అన్నాడు.

మేము పకపక నవ్వేశాం!

దాంతో అమృతరావు ఉడికిపోయేడు. 'నా మాట మీద నమ్మకం లేకుంటే చూడండి, ఇప్పుడే, ఈ క్షణం లోనే మీ పేర విల్లు రాసిపారేస్తాను' అంటూ కాగితం కలం అందుకుని గబగబ రాసి సంతకం పెట్టేడు.

అందుకు ముగ్గురు సాక్షులుగా ఆత్మప్రకాశ్ చేతా, ఇక్కడ పనిచేసే నా క్లర్కులచేతా సంతకాలు కూడా చేయించేడు...ఆ కాగితం ఇంకా ఇక్కడే వుంది, చూపిస్తానుండండి...'' అంటూ టేబిల్ సొరుగు లాగి, చుట్టి వున్న ఓ అరఠావు సైజు కాగితం తీసి అందించేడు కళ్యాణచెట్టి.

మడత విప్పి చదివేను.

"మైనంపూడి అమృతరావైన నేను, నా బుద్ధి పూర్వకంగా, ఎవ్వరి బలవంతమూ ఒత్తిడీ లేకుండా, పూర్తి ఆయురారోగ్యాలతో ఈ పత్రం రాస్తున్నాను.

దురదృష్టవశాత్తూ ఏ దుర్ఘటనలోనైనా నేను మరణించడం జరిగితే నా యావదాస్తీ, వస్తు సమేతంగా, బ్యాంకులోని నాలుగు లక్షల నగదుతోసహా నా మిత్రులూ, జనతా పబ్లిషింగ్ హౌస్ యజమానులూ అయిన శ్రీ కళ్యాణశెట్టిగారికీ, శ్రీ ముత్తులింగంగారికీ సరిసమానంగా చెందగలదు!''

—కింద అమృతరావు సంతకం, సాక్షుల సంతకాలూ వున్నాయి.

చట్టరీత్యా ఇది వీలునామా కింద గుర్తించబడక

పోయినా, అమృతరావు వేరే వీలునామా ఏదీ రాసి వుండకపోతే దీనికి ప్రాముఖ్యత లభిస్తుంది!

దాన్ని మడతపెట్టి సబిన్స్పెక్టర్కిస్తూ—"ఆ తలుపు రెక్కకి వేలాడుతున్న జర్కిన్ జేబులో హంతకుడుప యోగించిన పిస్తోలుంది. దాన్ని కూడా స్వాధీనం చేసుకో!" అన్నాను.

అతను కాగితం మడిచి భద్రంగా జేబులోకి తోస్తూ, లేచి తలుపువైపు నడిచేడు.

జర్కిన్ జేబులన్నీ వెదికి—"పిస్తోలు ఎక్కడ?" అన్నాడు ఆశ్చర్యంగా.

"బాగా చూడు! కుడి జేబులో వుంటుంది" అన్నాను.

అతను మరోమారు వెదికి—"నో! ఏమీ లేదే!" అన్నాడు.

ఒక్క ఉదుటున వెళ్ళి జేబులన్నీ తడిమేను.

పిస్తోలు మాయం!

కోపంతో నా మొహం జేవురించింది. నేనూ, డిటెక్టివ్ ఉదయకుమార్, సబిన్స్పెక్టర్ గదిబైట మాట్లాడుకుంటున్న సమయంలోనే ఎవ్వరో దాన్ని కాజేసి వుంటారు. నలుగురి బట్టలూ విప్పి సోదా చేస్తే సరి! నిప్పులు కక్కుతూ వాళ్ళవైపు తిరిగేను.

అదే క్షణంలో, బైట ఏదో ప్రళయం ముంచుకు వచ్చినట్టు ఆర్తనాదాలూ, గావు కేకలూ వినిపించేయి.

డిటెక్టివ్ ఉదయకుమార్ హడావుడిగా లోనికి వచ్చి—"ఇన్స్పెక్టర్! బెండింగ్ రూంలో మంటలు లేచాయి. ఎవ్వరో బుద్ధిపూర్వకంగా నిప్పంటించినట్టుంది

త్వరగా రండి" అన్నాడు తొందరపడుతూ.

క్షణ క్షణానికీ జనం అరుపులు శృతిమించుతున్నాయి బైట. "అందరూ బైటికి రండి" అంటూ జర్కిన్ అందుకుని పరుగుతీసేను.

6

ఆఫీస్ పక్కనే వున్న బైండింగ్ రూంలో భగ భగ మండుతున్నాయి అగ్ని శిఖలు! బైండింగ్ కోసం కట్టలు కట్టలుగా పేర్చివున్న ప్రింటు ఫారాలన్నీ తగలబడి పోతున్నాయి. అన్ని గదుల్లోకి దట్టంగా కమ్ముకుం టోంది పొగ.

దగ్గులతో, అరుపులతో భవనంలోని వాతావరణం భీభత్సంగా తయారైంది.

"ఉదయకుమార్జీ! వెంటనే వెళ్ళి ఫైర్ బ్రిగేడ్ వాళ్ళకి ఫోన్ చెయ్యండి. నేనీలోగా అందర్నీ భవనం లోంచి బైటికి పంపేస్తాను. మంటలు ఇతర గదుల్లోకి వ్యాపించేలా వున్నాయి" అన్నాను డిటెక్టివ్‌తో.

హాల్లో వున్న వాళ్ళందర్నీ బైటికెళ్ళమని ఆదేశించేను.

మరుక్షణం ఒకరిమీద ఒకరు పడుతూ లేస్తూ బైటికి పరుగుతీసేరు. వాళ్ళ వెనకే నేనూ ఇవతలికి వచ్చేను.

రోడ్డుమీద ట్రాఫిక్ జామ్ అయివుంది.

సాఫీగా సాగుతున్న మా దర్యాప్తును దారి మళ్ళించ డానికే ఈ గందరగోళం సృష్టించబడింది. దీనితో లోప లున్న అతిధులంతా బైటపడ్డమేగాక వారిమధ్య కలిసి పోయి హంతకుడు కూడా బయటపడ్డాడు!

"ఫైర్ బ్రిగేడ్ వాళ్ళు మరో నిమిషంలో వచ్చేస్తారు" అన్నాడు డిటెక్టివ్ ఉదయకుమార్ నన్ను సమీపించి.

కానిస్టేబుళ్ళు చుట్టూవున్న జనాన్ని వెనక్కి జరుపుతున్నారు. అంతలో గణగణ గంటలు మోగిస్తూ వచ్చేసింది ఫైరింజన్.

దాని ఇంఛార్జి, లోపల ఏ గదిలో మంటలు లేచాయో వివరించేను. మరుక్షణం వాళ్ళంతా తమ్తతమ సరంజామాతో లోనికి దూరేరు.

చూస్తూ చూస్తూనే లోపల పొగ సన్నగిల్లసాగింది. హత్యా సమయంలో భవనంలో వున్న వాళ్ళంతా ఇప్పుడు బైటపడ్డారు. ఈపాటికి సగంమంది ఎవరిదారిన వారు వెళ్ళిపోయుంటారు.

ఇక చేసేదేమీ లేదు. ఈ రాత్రంతా కేసును క్షుణ్ణంగా స్టడీచేసి రేపు ఓ పద్ధతి ప్రకారం దర్యాప్తు ప్రారంభించాలి. అక్కడ మిగిలిన కొద్దిమందినీ వెళ్ళిపొమ్మని చెప్పాను.

భవనం ముందు ఇద్దరు కానిస్టేబుళ్ళని నియమించేను కాపలాకి. అంతవరకూ డిటెక్టివ్ ఉదయకుమార్ నాకు తోడుగా వున్నాడు. ఇప్పటికే రాత్రి పదిన్నర దాటింది. ఇంకా అతన్ని ఆపడం బావుండదు.

"మీ సహకారానికి మెనీ థాంక్స్! ఇక వెళ్ళండి మీరు. రేపుదయం ఓమారు మిమ్మల్ని కలుసుకుని కేసు గురించి చర్చిస్తాను" అన్నాను షేక్‌హాండ్ ఇస్తూ.

"హత్య మన కళ్ళముందు జరిగింది. హంతకుణ్ణి మనమే పట్టుకు తీరాలి. లేకుంటే, మన వృత్తికే అపవాదు. రేపు నేనే క్రైం బ్రాంచికి వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను. గుడ్ నైట్!" అని కారెక్కి వెళ్ళిపోయేడు ఉదయకుమార్.

సిగరెట్ అంటించి రెండు దమ్ములు లాగేక వచ్చింది ఆలోచన. ఓమారు ఆ బుక్ షెల్ఫ్ మధ్యకెళ్ళి చూడాలని.

కానిస్టేబుళ్ళను బైటే వుండి చూస్తుండమని చెప్పి, భవనంలో ప్రవేశించేను.

హాల్లో లైటు వెలుగుతోంది. తలుపు మూసి, గోడ వారగా వున్న బుక్ షెల్ఫులవైపు నడిచేను. కేవలం ఒకే ఒక వ్యక్తి అదీ అడ్డంగా వెళ్ళగలిగేంతటి సందు మాత్రం వుంది ఆ రెంటి మధ్య!

ఆలోచిస్తూ కొద్ది కష్టంతో, అడ్డంగా సందులో ప్రవేశించగలిగేను. బుక్ షెల్ఫ్ అరల్లో వరసగా పుస్తకాలు పేర్చివున్నాయి. కిందినుంచి మీదివరకూ అరలు చూసుకుంటూ జరగసాగేను.

బుక్ షెల్ఫ్ మధ్య చేరుకోగానే హఠాత్తుగా కాళ్ళు నిలిచిపోయేయి. అక్కడ, పై అరలో ఓ లావుపాటి పుస్తకం తీసేసినట్టు స్థలం ఖాళీగా వుంది.

విచిత్రం ఏమిటంటే, ఆ అర నేలనించి ఏడడుగుల ఎత్తులో వుంది. హంతకుడు అక్కడి పుస్తకం తీసి, ఆ ఖాళీ స్థలంలో పిస్తోలు వుంచి షూట్ చేశాడనుకుంటే అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి.

మొదటి ప్రశ్న—హంతకుడు కింది అరమీద కాలు మోపి ఆ అరలోంచి పిస్తోలు ఉపయోగించేడనుకున్నా, ఈ సందులో కాలు మడవడానికే ఆస్కారం లేనప్పుడు కింది అరమీద కాలుపెట్టి నిల్చునే ప్రసక్తి లేదు! మరి? అంతెత్తు అరమధ్య పిస్తోలుపెట్టి, గురి చూడకుండా ఎలా కాల్చగలిగేడు?

ఒకేఒక సందర్భంలో అలా జరగడానికి వీలుంది. హంతకుడు చాలా పొడుగైనవాడై వుండాలి. నా హైట్ ఐదడుగుల పదంగుళాలు. ఇంత పొడుగున్న నాకే ఆ అర అందడంలేదు. అంటే, హంతకుడి హైట్ ఆరడుగుల ఐదంగుళాల వరకూ ఉండివుండాలి!

సభలో పాల్గొన్నవారిలో అంత పొడుగు ఎవరున్నారా? అని ఆలోచిస్తూ మెల్లిగా సందులోంచి బైటికి వచ్చేను. బుక్ షెల్ఫ్ ముందుకెళ్ళి చూసేను. ఇప్పుడు పుస్తకం తీసివున్న అర క్లియర్‌గా కనిపిస్తోంది.

కింది అరమీద కాలుపెట్టి ఎక్కి, ఆ అరను పరిశీలించేను. అందులో 'ఇన్‌సైక్లోపీడియా' గ్రంథాల సెట్టు పేర్చబడి వుంది. ఆ సెట్టులోంచే నాల్గవ సంపుటికి చెందిన గ్రంథం తీసివెయ్యబడింది. 'ఇన్‌సైక్లోపీడియా' గ్రంథాలెప్పుడూ పూర్తి సెట్టుగా అమ్మబడతాయి. ఒక్కో గ్రంథాన్ని విడిగా అమ్మరు. అమ్మినా ఎవ్వరూ తీసుకోరు.

ఐతే, హంతకుడు హత్యా సౌకర్యంకోసం సెట్టులోంచి ఆ పుస్తకం తీసివుంటే అది ఇక్కడే ఎక్కడో పడుండాలి. అరలన్నీ వెదికేను. ఓ ప్రక్కన కనిపించింది.

అప్పుడే ఆ ఆలోచన మెరిసింది. హాల్లో వెలుగుతున్న లైటార్పి, ఆ అరలో పుస్తకం తీసిన చోట పెన్ టార్చి పెట్టి చూడాలి. దాని వెలుగు స్టేజిమీద అమృతరావు నిల్చుని ప్రసంగించిన చోట పడితే, ఖచ్చితంగా హత్య నేనూహించినట్టే జరిగిందని రూఢి అవుతుంది.

గోడలో వున్న స్విచ్ దగ్గరికెళ్ళి లైటార్పేశాను. జేబులోంచి పెన్ టార్చి తీసి వెలిగించేను. షెల్ఫ్

మధ్యకెళ్ళి, కింది అరమీద కాలు పెట్టి ఎక్కి, పుస్తకం తీసివున్న ఖాళీ స్థలంలో టార్చి పెట్టి స్టేజి వైపు చూసేను.

చీకట్లో టార్చి కాంతి సరిగ్గా మైక్ దగ్గిర పడుతోంది.

అమృతరావు హత్య జరిగింది అక్కడే!

టార్చి అందుకుని, హాల్లో లైటు వెలిగిద్దామనుకుంటుండగా లోపల ఎక్కడో ఏదో చప్పుడై, చటుక్కున ఆగిపోయేను.

చేతిలో వెలుగుతున్న పెన్ టార్చి ఆర్పి చెవులు రిక్కించేను.

8

ఎవ్వరో హాలువైపు వస్తున్నట్టు సన్నని అడుగుల సవ్వడి! పిల్లిలా బుక్ షెల్ఫ్ పక్క కెళ్ళి నిల్చుని, ఊపిరి బిగబట్టి చూడసాగేను.

అప్పటికే నా కళ్ళు చీకటికి అలవాటుపడ్డాయి. ఓ ఆకారం అడుగులో అడుగు వేసుకుంటూ బుక్ షెల్ఫ్ దగ్గరికి వచ్చింది. అతనెవ్వరో చీకట్లో సరిగ్గా అంచనా వెయ్యలేకపోతున్నాను.

అప్పుడే అతని చేతిలో టార్చి వెలిగింది. ఆ కాంతిలో అతన్ని గుర్తించి అదిరిపడ్డాను.

అతను అమృతరావు సబ్ ఎడిటర్ ఆత్మప్రకాశ్! టార్చి ఫోకస్ షెల్ఫ్ మీద వేస్తూ ఏదో చూస్తున్నాడు కిందా మీదా చూసుకుంటూ షెల్ఫ్ మధ్య వచ్చి ఆగేడు. అతని టార్చి ఫోకస్ పై అరలో పుస్తకం తీసివున్న ఖాళీ స్థలంలో నిలిచిపోయింది!

కాసేపు దాన్ని పరీక్షగా చూసి, సాలోచనగా తలూపి, షెల్ఫ్ అటువైపునుంచి వెనక వున్న సందును పరిశీలించసాగేడు.

అందరితో బాటు వెళ్ళిపోయిన ఆత్మప్రకాశ్, దొంగ చాటుగా భవనంలో దేనికి ప్రవేశించేడు? ఎలా ప్రవేశించేడు? అమృతరావును చంపింది అతనేనా? షెల్ఫ్ లోంచి తీసిన పుస్తకాన్ని తిరిగి పెట్టడానికి వచ్చేడా?

నా ఆలోచనలింకా పూర్తి కాకముందే, ఆత్మప్రకాశ్ వెనుదిరిగి వచ్చిన దారినే వెళుతూండటం కనిపించింది. ఆశ్చర్యమేమిటంటే, నేనూహించినట్టు అతను బుక్ షెల్ఫులో ఏ పుస్తకమూ పెట్టలేదు. ఎలా వచ్చేడో తిరిగి అలా వెళ్ళిపోతున్నాడు.

అతన్ని కొద్దిదూరం పోనిచ్చి, అడుగులో అడుగు వేసుకుంటూ అనుసరించేను. ఆత్మప్రకాశ్ రెండు గదులు దాటి, మూడో గదిలో ఉన్న దొడ్డి తలుపులు తెరుస్తున్నాడు.

ఈ దారినే వచ్చాడన్న మాట! అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో, గడియ తీసిపెట్టి ఉంటాడు. ఆ హడావుడిలో దీనిగురించి పట్టించుకోలేదు.

ఆత్మప్రకాశ్ బైటికెళ్ళి, తిరిగి దగ్గరగా చేరవేసేడు తలుపుని. రెండు నిమిషాల వ్యవధి ఇచ్చి, మెల్లిగా తలుపు తెరిచేను.

అది విశాలమైన సందు. ఆ సందుగుండా కుడివైపు తిరిగి, భవనం ముందుకి రావచ్చు.

ఆత్మప్రకాశ్ సందులోపడి గబగబ వెళుతున్నాడు. అతను సందు మలుపు తిరిగేవరకు జాగ్రత్తగా వెంబడించి "ఆత్మప్రకాశ్" అన్నాను గట్టిగా.

నాలుగు తిరుగుతున్నవాడల్లా ఉలిక్కిపడి వెనుదిరిగేడు. నన్ను చూడగానే శిలాప్రతిమలా నిల్చుండిపోయేడు.

"దొంగచాటుగా భవనంలో దేనికి ప్రవేశించావ్?" అడిగాను.

కాసేపు అతని నోట మాట పెగల్లేదు. తరవాత తేరుకుని "మీరూ లోపలే ఉన్నారన్నమాట! నాకు మొదటనించీ ఆ బుక్ షెల్ఫుల దగ్గరేదో మిస్టరీ దాగుందని అనుమానం పీకసాగింది.

మీరు గమనించారా? ముందున్న బుక్ షెల్ఫు పై అరలో ఓ పుస్తకం తీసిన ఖాళీస్థలాన్ని? హంతకుడు ఆక్రమించే పిస్తోలు ఉపయోగించి ఉంటాడు.

అమృతరావుగారికి నేనెంతో ఋణపడి ఉన్నాను. ఆయన ఆకస్మికమరణం నాపై గట్టి దెబ్బతీసింది. ఆయన్ని చంపిన కిరాతకుణ్ణి ఉరికంబంమీద వేళాడుతూ చూడందే నాకు నిదరపట్టదు. అందుకే, నా తరఫున దర్యాప్తు చెయ్యడానికి ఇలా వచ్చేను. నన్నపార్థం చేసుకోకండి!" అన్నాడు ఆత్మప్రకాశ్ తొణకకుండా.

"సరే, మీరు వెళ్ళండి. అవసరం కలిగినప్పుడు పిలిపిస్తాను" అన్నాను రిస్టువాచీ చూసుకుంటూ.

ఒంటిగంట అవుతోంది!

ఇద్దరం భవనంలోంచి బైటికి వచ్చాం. ఆత్మప్రకాశ్ ఓ టాక్సీ ఎక్కి వెళ్ళిపోయేడు.

అప్పుడు తట్టింది నాకు ఓ ఆలోచన. దాన్ని గనక దిగ్విజయంగా అమలుజరిపితే, హంతకుడు తనంత తాను వచ్చి నా ఉచ్చులో చిక్కుకుంటాడు!

వెంటనే మోటర్ బైక్ ఎక్కి ఇంటికి బైలుదేరాను.

ఇంట్లో నా పెర్సనల్ గదిలో కూర్చుని, బల్లసొరుగు లోంచి లెటర్ పేడ్, పెన్ తీసేను. సిగరెట్ అంటించి, పేడ్ మీద గబగబ రాయసాగేను.

"మిస్టర్...

నిన్ను హంతకుడిగా నిరూపించే అభేద్యమైన ఆధారం నా దగ్గరుంది. అది కావాలనుకుంటే, నా నోరు మూయించాలనుకుంటే, రేపు రాత్రి ఎనిమిది గంటలకి మీనంబాకం విమానాశ్రయం పక్కనున్న శిథిలాలవద్దకు, పదివేల నెట్ క్యాష్ తీసుకురా!

నీ శ్రేయోభిలాషి!"

—అని రాసి దానిని కవర్లో పెట్టి, అంటించి, పైన ఓచిరునామా రాసి, బైక్ మీద జనరల్ పోస్టాఫీస్ చేరుకుని, దానిని పోస్ట్ చేసేను.

అది లోకల్ ఉత్తరం గనక, రేపు పదిగంటల పోస్టులో అతడికి అందుతుంది.

9

శిథిలాల దగ్గర నిల్చుని రిస్టువాచీ చూసుకున్నాను.

ఏడుగంటలు!

చలికాలం గనక అప్పటికే పరిసరాలు చీకట్లో మునిగిపోయేయి. ఆ చుట్టుపక్కల జనసంచారం ఉండదు' కీచురాళ్ళ రొద తప్పితే వేరే అలికిడిలేదు.

నేను ఊహించినట్లు హంతకుడు అతనే అయి ఉండి ఉంటే, నేను రాసిన ఉత్తరం చదివి అదిరిపోయి ఉంటాడు. డబ్బిచ్చి రాజీ కుదుర్చుకోడానికో, లేదా శాశ్వతంగా నా నోరు మూయించడానికో తప్పక వచ్చి తీరతాడు.

ఆలోచిస్తూ వెనుదిరిగి శిధిలాల్లో ప్రవేశించేను. అక్కడ మరీ అంధకారం! విరిగి శిధిలమైన మొండిగోడలూ, రాళ్లూ రప్పలతో నిండిన ప్రదేశం! నాకు అనుకూలమైన చోటు ఎన్నుకుని చీకట్లో నక్కి, చూస్తూ నిల్చున్నాను.

ఎనిమిదికి పదినిమిషాలుందనగా, ఎవ్వరో శిధిలాలవైపు వస్తున్న అడుగుల శబ్దం వినిపించసాగింది. నా గుండె గతి వేగం అందుకుంది.

శిధిలాల కవతల ఆగిపోయింది శబ్దం!

"ఏయ్ మిస్టర్! ఎక్కడున్నావ్?" పిలుస్తున్నాడతను.

బదులివ్వకుండా ఊపిరి బిగబట్టి నిల్చున్నాను.

"డబ్బు తెచ్చాను...పలకవేం" తిరిగి వినిపించింది కంఠం.

అంతకీ నేను జవాబివ్వలేదు. చివరికి అతనే అడుగులో అడుగు వేసుకుంటూ శిధిలాల్లో ప్రవేశించాడు.

జేబులోంచి త్రీ సెల్స్ టార్చి, పిస్తోలూ తీసి రెడీగా పట్టుకున్నాను. అతను చీకట్లో అటూయిటూ చూసుకుంటూ నేనున్నవైపు వస్తున్నాడు. కొద్దిగా దగ్గరకు రానిచ్చి, చటుక్కున ఫోకస్ వేసేను మీద.

అతను ఎవ్వరో కాదు.

డిటెక్టివ్ ఉదయకుమార్!

టార్చివెలగ్గానే అదిరిపడి నావైపు తిరిగేడు. నాకు తెలుసు అతని చేతిలో పిస్తోలు ఉంటుందని. ఆ పిస్తోలుకింకా పని దొరకక్కముందే నా పిస్తోలు పేలుకక్కింది.

"ఢాం!" అనే శబ్దంతో బాటు నేనూ పక్కకు గెంతేను. గుండు ఉదయకుమార్ జబ్బులో దిగింది. అత

నింతా పాకలోంచి తేరుకోకముందే, నాలుగు వైపులా టార్చిలైట్లు వెలిగేయి.

అంతవరకూ శిథిలాల్లో పొంచివున్న సార్జంట్ డేవిడ్ నలుగురు కానిస్టేబుళ్ళూ మెరుపులా డిటెక్టివ్‌ని చుట్టుముట్టి, అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

10

“డియర్ డిటెక్టివ్! నీమీద నాఅనుమానం ఎప్పుడు మళ్ళిందో తెలుసా? ఆ రెండు బుక్‌షెల్ఫుల మధ్య, సందులో ఒక మనిషి నిటారుగా నిల్చోడం తప్ప, కాలూ చెయ్యీ మడవలేడు. కాలూ చెయ్యీ మడవందే కింది అరమీద కాలుపెట్టి పై అరలోంచి కాల్పులు జరప లేడు.

ఐనా, హత్య పై అరమధ్యనించే జరపబడిందని రూఢీ అయింది. హంతకుడు చాలా పొడవై వుంటేతప్ప ఆ అరలోంచి గురిచూసి కాల్చలేడని నిశ్చయించుకున్నాను. ఆ సభకు హాజరైన వారిలో నీవుతప్ప అంత పొడగరి ఎవ్వరూ లేరు!

పోతే అమృతరావుని నీవు దేనికి చంపవలసి వచ్చిందో కారణాలు నాకు తెలీవు. అవి చెప్పే బాధ్యత నీది. ప్రైవేట్ డిటెక్టివ్వి గనుక, మేము దోషులచేత యెలా నిజాలు కక్కిస్తామో నీకు బాగా తెలిసిందే!” అన్నాను అతన్ని తీక్షణంగా చూస్తూ.

ఉదయకుమార్ పలకలేదు. చాలా సేపు తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడు. తరువాత ఒక నిశ్చయానికి వచ్చినట్టు, గట్టిగా నిట్టూరుస్తూ తలెత్తాడు.

"ఆల్ రైట్ ఇన్స్పెక్టర్! ఒప్పుకుంటాను. ఆ హత్య నేనే చేశానని ఒప్పుకుంటాను. అందుకు కారణం వుంది.

అమృతరావు ఇంతవరకూ పెళ్ళి చేసుకోక పోడానికి ఓ కథ ప్రచారంలోవుంది. మీకు తెలుసా?

అతను టీన్ఏజ్లో ఓ అమ్మాయిని ప్రేమించాడు. కులగోత్రాలు అడ్డుపడి వారి వివాహం జరగలేదు. ఆ అమ్మాయి తలిదండ్రులు ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా మరో వ్యక్తితో ఆమె పెళ్ళి జరిపించేరు. ఆవ్యక్తి ఎవ్వరో కాదు ఇన్స్పెక్టర్ నేనే!

అప్పుడు నేనింకా కాలేజీ విద్యార్థిని. చదువు పూర్తయ్యేక, ఈ వృత్తిలో శిక్షణపొంది, సతీ సమేతంగా మద్రాసువచ్చి, ప్రాక్టీసు ప్రారంభించేను. పేరు తెచ్చుకున్నాను.

ఇన్నేళ్ళ తరువాత, హఠాత్తుగా అమృతరావు మళ్ళీ తటస్థపడ్డాడు నా భార్యకు, ఇదే నగరంలో! తనవల్లే అతను ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోయేడని తెలిసిన నా భార్యకు అతనిపట్ల సానుభూతీ, ప్రేమా తిరిగి ప్రజ్వరిల్లేయి!

వారిమధ్య ఏర్పడ్డ పరిచయం, నానాటికీ అసహజంగా ఎదుగుతున్నట్టు అనుమానం కలిగింది నాకు. దాంతో రహస్యంగా వారిమీద ఓ కన్నేసి ఉంచేను.

అప్పుడే తెలిసిందినాకు వారి మాజీ ప్రణయం గురించి. అతన్ని మళ్ళీ ఎన్నడూ కలుసుకోవద్దని నా భార్యకు గట్టిగా చెప్పేశాను.

దాంతో వారి కలయిక రహస్యంగా కొనసాగడం ప్రారంభమైంది. ఇద్దరూ లైంగిక సంబంధంకూడా ఏర్పరచుకున్నట్టు నా పరిశోధనలో స్పష్టమైంది.

అప్పుడు పడింది నాలో హత్య చెయ్యాలన్న విష బీజం! పథకం రూపొందించేను. నేరాన్ని విష్ణుప్రాదం మీదికి తోసెయ్యాలని రెండురోజులు క్రితం ఓ కేసు విషయమై అతన్ని కలుసుకున్నప్పుడు అతని పిస్తోలు దొంగిలించాను.

ఆ బుక్ షెల్ఫులమధ్య నిల్చుని అమృతరావుని షూట్ చేసి, దాన్ని కుర్చీలకింద పడేశాను.

తరువాత మీరూ, సబిన్ స్పెక్టర్, ఆత్మప్రకాశ్ ఆఫీస్ బైటనిల్చుని మాట్లాడుకుంటున్నప్పుడు, మిమ్మల్ని తికమక పెట్టడానికి మీ జేబులోంచికూడా పిస్తోలు కాజేసిందికూడా నేనే!

తరువాత మీరు బుక్ షెల్ఫులు చెక్ చేసి రమ్మన్నప్పుడు బైటికెళ్ళి బైండింగ్ రూంలో నిప్పంటించిదీ నేనే! అయినా మీ ఎక్సరే కళ్ళనుండి నేను తప్పుకోలేకపోయాను'' అన్నాడు ఉదయకుమార్ భారంగా నిట్టూరుస్తూ.

—: ఐపోయింది :—